తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 97 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ గురువారం 14 -11-2024 వెల: 5/రూ -

# రాజధానిలో రోడ్ల పనులకూ ఊపు

## ఔటర్, తూర్పు బైపాస్ భూసేకరణ ఖర్చు భరిస్తాం..

- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం హామీ
- చంద్రబాబు ప్రయత్నాలతో తప్పిన రూ.6 వేల కోట్లకుపైగా ఆర్థిక భారం
- కేంద్ర వార్షిక ప్రణాళికలో బైపాస్
- త్వరలో ఔటర్‌పైనా నిర్ణయం
- ప్రతిగా స్టేట్ జీఎస్టీ, పన్నుల నుంచి మినహాయింపును కోరిన కేంద్రం
- అంగీకరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



**అమరావతి శీఘ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించింది. రాజధాని అభివృద్ధిలో కీలక మైన రెండు ప్రాజెక్టుల భూ సేకరణ ఖర్చును కేంద్రమే భరించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (ఎంవోఆర్‌టీహెచ్) సానుకూలత వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టుల్లో ఒకటి 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు. మరొకటి 59 కిలోమీటర్ల పొడవైన తూర్పు బైపాస్.**

అమరావతి: అమరావతి శీఘ్ర అభివృద్ధి విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి ఫలించింది. రాజధాని అభివృద్ధిలో కీలక మైన రెండు ప్రాజెక్టుల భూ సేకరణ ఖర్చును కేంద్రమే భరించనుంది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (ఎంవోఆర్‌టీహెచ్) సానుకూలత వ్యక్తం చేసింది. ఆ ప్రాజెక్టుల్లో ఒకటి 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు. మరొకటి 59 కిలోమీటర్ల పొడవైన తూర్పు బైపాస్. ఈ రహదారుల నిర్మాణం చేయాలంటే వేల ఎకరాల భూమిని సేకరించాలి. ఇందుకు రూ.6 వేల కోట్లపైనే నిధులు అవసరం.

2లో

# దాడి బీఆర్ఎస్ కుట్రే!

## వెనక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించం



- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ తలకిందులుగా తపస్సు చేసినా ప్రభుత్వాన్ని అస్థిరపరచలేరు
- కేసు నుంచి తప్పించుకోవడానికి బీజేపీతో కేటీఆర్ ఒప్పందం
- కేసీఆర్ బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా బయటికొచ్చి మాట్లాడాలి
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి పొన్నం

హైదరాబాద్: బీఆర్ఎస్ అరాచక శక్తులతో కలిసి కుట్రపూరితంగా దళిత, గిరిజన రైతులను రెచ్చగొట్టి లగచర్లలో జిల్లా కలెక్టర్, ఆర్డీవో స్థాయి అధికారిపై దాడి చేయించిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తలకిందులుగా తపస్సు చేసినా ఈ ప్రభుత్వాన్ని అస్థిరపర్చలేరని చెప్పారు. లగచర్ల ఘటనలో నిందితుల కాల్ డేటాను సేకరించగా, బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఉన్నట్టు తేలిందన్నారు. దీని వెనుక ఎంతటి పెద్దవారున్నా ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం, వారితో చర్చించడం, న్యాయ స్థానాలకు వెళ్లడం వంటి అవకాశాలుండగా, బీఆర్ఎస్ నేతలు రైతులను రెచ్చగొట్టి అధికారులపై

2లో

# జార్ఖండ్ తొలి విడతలో 66% పోలింగ్





# సోషల్ సైకోలపై ఉక్కుపాదం

- అసభ్యకర పోస్టులు పెట్టినవారిపై కేసులు
- విచారణకు రావాలని డైరెక్టర్ ఆర్జీవీకి నోటీసులు
- స్టేషన్‌లో విచారణకు మాజీ మంత్రి కాకాణి హాజరు
- మాజీ మంత్రి అంబటి ఇంటి నుంచి ఒకరి అరెస్టు
- నటులు పోసాని, శ్రీరెడ్డిపై వేర్వేరు జిల్లాల్లో కేసులు

2లో



# మీ మోసాలపై నేనే పోస్టు చేస్తా..

- దమ్ముంటే నాపై కేసు పెట్టండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఈ మేరకు పోస్టు చేయాలని పిలుపునిస్తున్నా
- ఎంత మందిని అరెస్టు చేస్తారో చూద్దాం
- అరెస్టు చేయడం మొదలు పెడితే నా నుంచే ప్రారంభించండి

2లో

# వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి



- మహాయుతి కూటమిని ఓడించండి
- ముంబై ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి
- భారీగా తరలివచ్చిన స్థానిక తెలంగాణ వాసులు

ముంబై: దివంగత శివసేన అధినేత బాల్ ఠాక్రేకు ఏక్‌నాథ్ శిందే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌కు అజిత్ పవార్, కాంగ్రెస్ నేత రాహుల్ గాందీకి మిలింద్ దేవ్‌రా వెన్నుపోటు పొడిచారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు.

2లో

# రేవంత్ అల్లుడి కంపెనీ కోసమే ఫార్మా విలేజ్: కేటీఆర్




తెలంగాణ భవన్: తెలంగాణలో సాగుతోంది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిర ఎమర్జెన్సీ పాలన అంటూ తీవ్ర విమర్శలు చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. అలాగే.. పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు..

2లో



# సర్కారుపై బీజేపీ సమరం

- డిసెంబర్ 1 నుంచి 7 దాకా పాదయాత్రలు
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్వహణ
- కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి నాయకత్వం
- పార్టీలోని సకల శ్రేణులు పాల్గొనేలా కార్యాచరణ
- ఈ నెల 16, 17 తేదీల్లో 'మూసీ నిద్ర'కు సమాయత్తం
- రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై బీజేపీ వరుస పోరాటాలు

హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు బీజేపీ వేగంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ధాన్యం కొనుగోళ్లపై ఇప్పటికే ఈ నెల 9, 11, 13 తేదీల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు మద్దతు ప్రకటించిన ఆ పార్టీ నేతలు, 16, 17 తేదీల్లో మూసీ ప్రాజెక్టు బాధితుల సమస్యలు తెలుసుకొనేందుకు 'మూసీ నిద్ర'కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. దానికి కొనసాగింపుగా మరో భారీ కార్యాచరణను సిద్ధం చేశారు.

# దాడి బీఆర్ఎస్ కుట్రే!

(మొదటి పేజీ తరువాయి)

దాడులు చేయించడం దుర్మార్గమన్నారు. భట్టి బుధవారం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు రావొద్దని, అభివృద్ధి జరగొద్దనే దుర్మార్గమైన ఆలోచనతో ప్రతిపక్షం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 'గత బీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్నసాగర్ కోసం భూసేకరణ చేపట్టినప్పుడు ప్రతిపక్ష పార్టీగా ప్రజాస్వామ్యయుతంగా రైతుల పక్షాన గొంతెత్తాం. అధికారులను కలిశాం. న్యాయస్థానాలకు వెళ్లాం. పత్రికల ద్వారా నిరసనను తెలియజేశాం. కానీ ఏనాడు ఇలా దాడులకు తెగబడలేదు'అని భట్టి అన్నారు. ఇలా దాడులు చేయించడం సబబేనా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు.

బాధ్యత కలిగిన ప్రతిపక్ష నాయకుడిగా బయటకు వచ్చి ఈ అంశంపై మాట్లాడాలని కోరారు. అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కుట్రపూరిత దాడుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఉద్యోగులు అధైర్యపడకుండా ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని హితవు పలికారు. ప్రజాప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. అత్యంత వెనుకబడిన కొడంగల్ నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ఏర్పాటుచేసి పరిశ్రమల అభివృద్ధితో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి.. ఇక్కడికొచ్చే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంలో భాగంగానే రీజినల్ రింగ్ రోడ్%-% ఔటర్ రింగ్ రోడ్ మధ్య పరిశ్రమల ఏర్పాటుకు క్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఫార్ములా ఈ-రేస్ కేసు నుంచి తప్పించుకోవడానికి కేటీఆర్ ఢిల్లీకి పోయి బీజేపీ పెద్దలను కలిసి ఒప్పందం చేసుకున్నాడని భట్టి ఆరోపించారు. అందుకే మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటేయమని పిలుపునిచ్చి బీజేపీకి ఓటేయాలని కేటీఆర్ పరోక్షంగా చెప్పారని ఆరోపించారు. గవర్నర్‌పై సంపూర్ణమైన విశ్వాసం ఉందని, ఫార్ములా ఈ-రేస్ కేసు విచారణకు ప్రభుత్వానికి సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు. గవర్నర్ తిరస్కరిస్తే చట్టం ప్రకారం ఏం చేయాలో అదేవిధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని, అధికారులపై దాడిని వారు కనీసం ఖండించలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

# సర్కారుపై బీజేపీ సమరం

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలు, గత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్రలు నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు వారంపాటు ఈ పాదయాత్రలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ నాయకత్వం వహించనుండగా, బీజేపీలోని కింది స్థాయి కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నేత వరకు అందరూ తప్పనిసరిగా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా: 2028 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా, ఇప్పటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు వరుస కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుపైనే పోరాట కార్యాచరణ చేపడుతున్నది.పాదయాత్రలో ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలపైనే బీజేపీ నేతలు దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని మండలాలు, గ్రామాలకు చేరుకునే వీలును బట్టి ఐదు నుంచి ఏడురోజుల పాటు పాదయాత్రలు నిర్వహించనున్నారు.

**రోజుకు 15 నుంచి 17 కి.మీ. యాత్ర**

నియోజకవర్గాల్లో రోజుకు 15 నుంచి 17 కి.మీ. దూరం పాదయాత్ర కొనసాగేలా రోడ్‌మ్యాప్‌ను రూపొందిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో రోజుకు అంతకంటే ఎక్కువ దూరం యాత్ర చేసే వీలుండటంతో ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కొందరు నాయకులతో కూడిన బృందాన్ని ఏర్పాటుచేసి పర్యవేక్షణ బాధ్యత అప్పగిస్తారు. ప్రతిరోజు ఎక్కడి నుంచి ఎక్కడి దాకా యాత్ర నిర్వహించాలి? నైట్ హాల్ట్ ఎక్కడ ఉండాలి? అనే అంశాలన్నింటినీ ఈ బృందాలు చూసుకొంటాయి. వచ్చే నాలుగేళ్లపాటు నిరంతరం ప్రజల్లోనే ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాడేందుకు పార్టీ పరంగా వివిధ రూపాల్లో చేపట్టబోయే నిరసనలు, ఆందోళ నలకు ఈ పాదయాత్ర పూర్వరంగంగా ఉపయోగ పడుతుందని పార్టీ నాయకులు అంచనా వేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభు త్వం మొగ్గుచూపినా, చూపకపోయినా... గ్రామ, మండల స్థాయిల్లో బీజేపీ బలపడేందుకు ఈ పాదయాత్రలు దోహదపడతాయని భావిస్తున్నారు.

**25 ప్రాంతాల్లో మూసీ నిద్ర**

ఈ నెల 16 నుంచి 17వ తేదీ ఉదయం వరకు మూసీ పరీవాహక ప్రాంతాల్లోని 25 ప్రాంతాల్లో మూసీ నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ప్రకాష్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డితోపాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలంతా ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మూసీ పరీవాహక ప్రాంత ప్రజలతో కలిసి భోజనం చేసి బస చేస్తామని వెల్లడించారు.

## జార్ఖండ్ తొలి విడతలో
# 66% పోలింగ్

(మొదటి పేజీ తరువాయి)

జైపూర్: జార్ఖండ్‌లో మొదటి విడతలో భాగంగా బుధవారం 43 స్థానాలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. రాత్రి 10 గంటల సమయానికి 65 శాతం ఓటింగ్ నమోదైంది. తొలి దశలో మాజీ సీఎం చంపయీ సొరేన్, మాజీ సీఎం మధు కోడా భార్య, మాజీ ఎంపీ గీతా కోడా సహా 683 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.ఈ నెల 20న రెండో విడత పోలింగ్ జరగనుంది. 23న ఫలితాలు వెలువడనున్నాయి. మరోవైపు, దేశ వ్యాప్తంగా 10 రాష్ట్రాల్లోని 31 అసెంబ్లీ సీట్లకు, కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి కూడా బుధవారం ఉప ఎన్నికలు జరిగాయి. వయనాడ్‌లో 65 శాతం, అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 55 నుంచి 90 శాతం పోలింగ్ నమోదైంది.


# వెన్నుపోటుదారులకు బుద్ధి చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)

ఈ ముగ్గురు మోసగాళ్లకు మహారాష్ట్ర ప్రజలు ముఖ్యంగా అక్కడి తెలుగు ప్రజలు తమ ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (ఎస్‌పీ)ల మహావికాస్ ఆఘాడీ (ఎంవీఏ)కూటమిని గెలిపించాలని కోరారు. రేవంత్ బుధవారం సాయంత్రం ముంబైలో తెలుగు ప్రజలు నివసించే వర్లీ, ధారావి, సైన్ కోలివాడల్లో ఎంవీఏ అభ్యర్థులకు మద్దతుగా బహిరంగ సభలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార మహాయుతి కూటమిపై విమర్శలు గుప్పించారు. ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య ఠాక్రేను వర్లీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి, నిజామాబాద్ కోడలైన వర్షా గైక్వాడ్‌ను ధారావి నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇక్కడి తెలుగు ప్రజల సమస్యలన్నింటినీ ఎంవీఏ ప్రభుత్వం పరిష్కరించేలా తాను హామీగా ఉంటానని తెలిపారు. కాగా వర్లీ బీడీడీ చాల్స్‌లో నివసించే స్థానిక తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డి రోడ్డు షోకు బ్రహ్మరథం పట్టారు. దీంతో రేవంత్‌రెడ్డి కూడా తాను ముంబైలో కాకుండా నిజామాబాద్, కరీంనగర్‌లో ఉన్నట్టుగా అనిపిస్తోందని అన్నారు. రోడ్డు షోకు ముందు రేవంత్‌రెడ్డి వర్లీ బీడీడీ చాల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర (బాలాజీ) స్వామి ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలంగాణ ప్రజలు వారి సమస్యలు తెలుపుతూ వినతిపత్రాలు సమర్పించారు.



## రాజధానిలో రోడ్ల
# పనులకూ ఊపు



ఏపీకి ఉన్న అప్పులు, ఆర్థిక కష్టాల నేపథ్యంలో భూ సేకరణ చేసే స్థోమత సర్కారుకు లేదు. ఆ ఖర్చును కేంద్రమే భరించాలని చంద్రబాబు ఇటీవల ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర రహదారుల మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విజ్ఞప్తిచేశారు. అప్పుడు పరిశీలన చేస్తామని మాత్రమే కేంద్రమంత్రి చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబు సూచనల మేరకు ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, అధికారులు పలుమార్లు ఢిల్లీకి వెళ్లి సీఎం విన్నపాల గురించి కేంద్రం వద్ద ప్రస్తావించారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలు ఫలించాయి. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు, తూర్పుబైపాసల కోసం భూ సేకరణకు అయ్యే ప్రతీ రూపాయి తామే భరిస్తామని ఎంవోఆర్‌టీహెచ్ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి లిఖితపూర్వక సమాచారం ఇచ్చింది. ప్రతిగా, పరోపకారం కింద తమకు స్టేట్ జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని కోరింది. ఇందుకు సర్కారు కూడా సరేనంది. స్టేట్ జీఎస్టీని మినహాయిస్తూ ఆదేశాలు ఇచ్చింది. కేంద్ర నిర్ణయం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై దాదాపు ఆరువేల కోట్ల (ఔటర్ 4వేలు, తూర్పుబైపాస్ 2వేల కోట్ల)భారం తప్పింది. ఇదంతా సీఎం చంద్రబాబు చొరవతోనే జరిగిందని ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రె డ్డి తెలిపారు.తెలుగుదేశం ప్రభుత్వం 2014-19 కాలంలోనే అమరావతి ఔటర్ రహదారి నిర్మాణం ప్రతిపాదించింది. దీన్ని భారత్‌మాల చాలెంజింగ్ కార్యక్రమం కింద చేర్చి అమలు చేసేందుకు కేంద్రం అప్పట్లో అంగీకరించింది. అయితే, భూ సేకరణ ఖర్చు సగం భరించాలని కేంద్రం షరతు విధించింది. దీనిపై చర్చోపచర్చలు సాగుతుండగానే ఎన్నికలు జరిగి జగన్ అధికారంలోకి వచ్చారు. అమరావతి రాజధానినే ధ్వంసం చేసిన జగన్, దానికోసం ఉద్దేశించిన ఔటర్ ప్రాజెక్టును కూడా పక్కనపెట్టించారు. కానీ, అప్పటికే అలైన్‌మెంట్, భూ సేకరణ డీపీఆర్‌లు రెడీ అయ్యాయి. ఈ ప్రాజెక్టును జగన్ ప్రభుత్వం వ్యతిరేకించిందన్న కారణంతో కేంద్రం కూడా పక్కనపెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలివిడత ఢిల్లీకివెళ్లినప్పుడు కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి పెద్ద ప్రజంటేషన్ ఇచ్చారు. అమరావతి ఔటర్‌కు రూ.26 వేల కోట్ల నిర్మాణ వ్యయం కానుంది. ఇందులో భూసేకరణ వ్యయం 4వేల కోట్లపైనే. ఈ నేపథ్యంలో రహదారి నిర్మాణంతోపాటు, భూ సేకరణ కేంద్రమే చేయాలని చంద్రబాబు గట్టిగా కోరడం సత్ఫలితాన్నిచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణంలో ఇదో అద్భుతమైన ముందడుగు అని మంత్రి జనార్దన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# మీ మోసాలపై నేనే పోస్టు చేస్తా..

అమరావతి: ప్రభుత్వ అక్రమాలు, వైఫల్యాలు, మోసాలుపై ప్రశ్నించే స్వరం విన్పించకూడదనే దురాలోచనతో సుప్రీంకోర్టు తీర్పును అపహాస్యం చేస్తూ దేశంలో ఎక్కడా లేని విధంగా సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ, అక్రమంగా నిర్బంధిస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మండి పడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీని విమర్శిస్తూ రాజకీయంగా ఆయనను వ్యతిరేకించే వారు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నా ఎవరినీ అరెస్టు చేయడం లేదన్నారు. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..' దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 680 మందిపై సోషల్ మీడియా కార్యకర్తలకు నోటీసులు ఇచ్చారు. 147 మందిపై కేసులు పెట్టి.. 49 మందిని అరెస్ట్ చేశారు. చంద్రబాబు మోసాలను సోషల్ మీడియా వేదికగా నేను పోస్ట్ చేస్తాను. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా ఇదే పోస్టు పెట్టాలని పిలుపునిస్తున్నా. ఎంత మందిపై కేసులు పెడతారో చూద్దాం. ఆ కేసులేవో నాతోనే మొదలుపెట్టండి.' ఒక వైపు చంద్రబాబు హయాంలో రాష్ట్రం కుదేలైపోయే పరిస్థితి కన్పిస్తోంది. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తున్నారు. ప్రతీ వర్గాన్ని మోసం చేస్తున్నారు. మహిళలు, చిన్నారుల పరిస్థితి ఎప్పుడూ చూడని విధంగా ఉంది. ఏకంగా 110 మంది మహిళలు, చిన్నారులపై ఈ ఐదున్నర నెలల్లోనే అత్యాచారాలు, లైంగిక దాడులు జరిగాయి. ఇందులో 11 మంది చనిపోయారు. నిన్న (మంగళవారం) కూడా మూడు ఘటనలు జరిగాయి. రాష్ట్రంలో ఐదున్నర నెలల కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 177 హత్యలు.. 500కు పైగా హత్యాయుత్నాలు జరిగాయి. మహిళలపై అన్యాయులు, అత్యాచారాలకు అంతే లేకుండా పోయింది.' బడ్జెట్ చూస్తే మోసం.. అన్ని రకాలుగా ఈ ప్రభుత్వం విఫలమైన పరిస్థితి. పిల్లలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల బకాయిలు రూ.2,300 కోట్లు దాటాయి. వాళ్లు రోడ్డెక్కుతున్నారు. పట్టించుకోవడం లేదు. 108, 104 సిబ్బంది ధర్నా చేస్తున్నారు. అతలాకుతలమైపోయిన పరిస్థితుల్లో సూపర్ సిక్స్, సూపర్ సెవన్ మోసం.. ఇలాంటి పరిస్థితులను నిలదీస్తే.. ప్రశ్నించే గొంతును నొక్కేందుకు అక్రమ కేసులు బనాయిస్తూ అక్రమంగా నిర్బంధిస్తూ ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు.

## సోషల్ సైకోలపై
# ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వంలో కీలక నేతలను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ సానుభూతిపరులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇలాంటి వారిపై ఎక్కడికక్కడ కేసులు నమోదు చేస్తున్నారు. స్టేషన్లకు పిలిపించి విచారిస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా తన ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేసిన కేసులో సినీ డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మకు ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎస్ఐ బి.శివరామయ్య బుధవారం హైదరాబాద్ వెళ్లి ఆర్జీవీకి నోటీసులు అందజేశారు. ఈ నెల 19న ఒంగోలు రూరల్ సర్కిల్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని అందులో పేర్కొన్నారు. కాగా, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన తనయుడు రాజగోపాల్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అసభ్యకర వ్యాఖ్యలతో పోస్టులు పెట్టిన కేసుకు సంబంధించి వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ముత్తుకూరు పోలీసస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. సీఐ రవినాయక్ ఆధ్వర్యంలో 2గంటల పాటు జరిగిన విచారణలో కాకాణి 54 ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. మరోవైపు టీటీడీ చైర్మన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు పోసాని కృష్ణమురళిపై తెలుగు యువత నాయకులు చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, వంగలపూడి అనితను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన నటి శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగు మహిళలు విశాఖపట్నం కంచరపాలెం, అనంతపురం, రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు పోలీసస్టేషన్లలో ఫిర్యాదు చేశారు.ఇదిలాఉండగా, ఫేస్‌బుక్‌లో 'నేను మావా' పేరుతో ఖాతా నిర్వహిస్తూ కూటమి నేతలు, వారి కుటుంబ సభ్యులను దూషిస్తూ అసభ్యకర పోస్టులు పెట్టిన శ్రీసత్యసాయి జిల్లా రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త బాలాజీ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు.

## రేవంత్ అల్లుడి కంపెనీ కోసమే
# ఫార్మా విలేజ్: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



కిడ్నాప్ అని ఆరోపించారు. సీఎం తన సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్ అంటూ నాటకాలడుతున్నారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ..'రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగింది. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం పడుతాం. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, శరత్‌ల ఫార్మా కంపెనీలను విస్తరించట కోసం ప్రభుత్వం సహకరిస్తుంది.తన ఏడు ఎకరాల భూమి కోల్పోతున్న కారణంగానే సురేష్ కలెక్టర్‌ను అడిగాడు. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ?. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా?. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా?. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జీలను కూడా తప్పుదోవ పట్టిస్తోంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ పాలన.రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతున్నది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతుల అక్రమ అరెస్టులు జరుగుతుంటే సీఎం ఎక్కడ?. షోలాపూర్ చౌరస్తాలో నిలబడినా.. రేవంత్‌ను ఎవరూ గుర్తుపట్టరు. కనీసం ఆయన సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. తీవ్రవాదుల మాదిరిగా రైతులను పొలాల వెంబడి తరుముతున్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమెంటో ముఖ్యమంత్రి చెప్పాలి. రైతులు తిరుపతి రెడ్డికి ఫోన్ చేసి అడిగితే.. తన్ని భూములు తీసుకుంటామని హెచ్చరించలేదా?. కేంద్ర పెద్దలను నేను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్‌ను కలవటం కూడా తప్పే. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా?. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని.. మళ్ళీ యూ టర్న్ ఎందుకు తీసుకున్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారు.

# టిజిపిఎస్ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా

# పగడ్బందీగా నిర్వహించాలి



- సంగారెడ్డి జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్ష .
- పరీక్షకు హాజరైతున్న అభ్యర్థులు 15123.
- అభ్యర్థులు ఉదయం 8:30 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- అభ్యర్థులను ఉదయం 9.00 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.
- అభ్యర్థులు ఒరిజినల్ ఐడీలతో పరీక్ష కేంద్రం కు రావాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**సంగారెడ్డి అర్బన్ , నవంబర్ 13:** టీజీపీఎస్సీ గ్రూప్ -3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. బుధవారం టిజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్,స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డిఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్ తో నిర్వహించిన ట్రైనింగ్ కమ్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తేది 17.11.2024 నఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం12.30గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ( పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు), సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష ( పరీక్ష కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారు) ఉంటుందని, తేది 18.11.2024 న ఉదయం 10. 00 గంటలనుండి. మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష( పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారు) ఉంటుందని కలెక్టర్ తెలిపారు. టిజిపిఎస్సి గ్రూప్ -3 పరీక్షలు సజవుగా,ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరు అని తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో 15123 మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ గ్రూప్3 పరీక్ష రాస్తున్నారని వీరి కోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు (%ఱ%) నలుపు/నీలం బాల్ పాయింట్ పెన్నులు (%ఱఱ%) పెన్సిల్ %�d% ఎరేజర్ (%ఱ%) హాల్ టికెట్ను దానిపై అతికించిన ఫోటో (%ఱజ%) ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫోటో %×ఱ% కార్డ్ని మాత్రమే పరీక్ష హాల్లోకి తీసుకెళ్లాలి. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే వ్రాయాలి. సెల్ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్ తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్ష ఎంట్రెన్స్ గేట్, పరిష కేంద్రాలు టేబుల్, చేర్స్ సానిటైజ్ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు, పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమాజంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , అదనపు ఎస్పీ సంజీవరావు, జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య

**సంగారెడ్డి, అర్బన్ నవంబర్ 13::** బుధవారం నాడు నూతనంగా గ్రంథాలయ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన గొల్ల అంజయ్య జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేయడం జరిగింది .అదేవిధంగా గ్రంథాలయ వారోత్సవాలు కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు.

## 15 నాడు టిపిటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం




**సంగారెడ్డి అర్బన్, నవంబర్ 13:** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం 15 నాడు ఉదయం 10 గంటల నుండి సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్ లో జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్ లు అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వై. అశోక్ కుమార్, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. నాగిరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు యం. ప్రకాశరావు, ఎన్నికల అధికారిగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్ లు హాజరవుతారు. ఈ సమావేశానికి సంగారెడ్డి జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు ఇట్టి సమావేశానికి హాజరు కావాలని కోరారు. అనంతరం నూతన కమిటీకి ఎన్నికలుంటాయని తెలిపారు.

## సర్వే వివరాలు గోప్యంగా ఉంటాయి

**ప్రజలు సర్వేకు సహకరించాలి**

**హత్నూర మండలం చందాపూర్, పల్పనూరు గ్రామాలలో సమగ్ర సర్వేను పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు.**



**సంగారెడ్డి అర్బన్ ,నవంబర్ 13:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలోభాగంగా సర్వే వివరాలు ప్రజల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం హత్నూర్ మండలం పల్పనూరు, చందాపూర్ గ్రామాలలో ఇంటింటి సమగ్ర సర్వేను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్వే వివరాలు గోప్యంగా ఉంటాయని సర్వే పై ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లకు సరైన సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. సర్వేలో ఎలాంటి తప్పులు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వే ఫారములు నింపే విధానాన్ని కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బందికి విరాలు నింపే విధానంపై అవగాహన కల్పించారు. గ్రామాలలో సిబ్బంది సర్వేకు వచ్చిన సమయంలో ఆయా కుటుంబాల వారు ఉండకపోవడంతో సర్వేలో జపం జరుగుతున్నట్లు గ్రహించారు. రేపు సర్వే ఏ ఇండ్లు జరుగుతాయో ముందుగానే ఆయా ఇండ్ల లో నివసించే వ్యక్తులకు సమాచారం ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ ఆదేశించారు. సర్వే వివరాలు గోప్యంగా ఉంటాయని సర్వే రికార్డులు స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తామని ఎన్యుమరేటర్లు ప్రజలు తెలిపే వివరాలను కోడ్ రూపంలో రాస్తున్నందున ప్రజలు సర్వేపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సర్వే వివరాలు వెంట వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఎన్యుమరేటర్లకు కలెక్టర్ సూచించారు. సూపర్వైజర్లు నోడల్ అధికారులు సర్వే వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎన్యుమరేటర్లకు అవసరమైన సలహాలు సూచనలు అందజేయాలని కలెక్టర్ సూచించారు . ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ ఆర్ స్వప్న , తహసీల్దార్ పర్వీన్ షేక్ ,ఎంపిడిఓ శంకర్, ఎన్యుమరేటర్లు , అధికారులు పాల్గొన్నారు .

## తప్పులు లేని ఓటరు జాబితా కోసం నిరంతర కృషి

**సంగారెడ్డి ఆర్ డి ఓ, సి హెచ్ రవీందర్ రెడ్డి**

**సంగారెడ్డి అర్బన్, నవంబర్ 13:** తప్పులు లేని ఓటరు జాబితా కోసం నిరంతరం పని చేయడం జరుగుతుందనీ సంగారెడ్డి ఆర్ డి ఓ సి హెచ్ రవీందర్ రెడ్డి తెలియజేశారు. ఎస్ఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి బుధవారం నిర్వహించే సంగారెడ్డి ఆర్డీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ నాయకులు పాల్గొనడం జరిగింది. ఓటరు జాబితా తప్పులు లేని ఫోటో జాబితా రూపొందించడం తమ లక్ష్యమని వారు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ తహసిల్దార్లు సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, రాజకీయ ప్రతినిధులు ఎంఐఎం ఫాజిల్, యాకుబ్ అలీ, భాజపా నుండి కొండాపూరం జగన్, బంధాన్న, తహర్ పాషా, సిపియం నుండి తదితర నాయకులు పాల్గొన్నారు.



## రైతుల నుండి ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

- హత్నూర మండలం చందాపూర్, పల్పనూరు గ్రామాలలో కొనుగోలు కేంద్రాల పరిశీలన.
- కొనుగోలు కేంద్రంలో రికార్డులు తనిఖీ
- కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు వెంటనే ట్యాబ్లను నమోదు చేయాలి

-రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి అర్బన్ , నవంబర్ 13.:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం , పల్పనూరు, చందాపూర్ గ్రామాలలో డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు,ధాన్యం విక్రయ కేంద్రాల్లో రైతుల సమస్యలు తెలుసుకొని, వాటికి తగిన పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందిస్తున్న సదుపాయాలు,ధాన్యం విక్రయ కేంద్రాల్లో రైతుల సమస్యలు తెలుసుకొని, వాటికి తగిన పరిష్కారాలు చూపేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రైతులు దాన్యం విక్రయాల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు అందించేలా కొనుగోలు చేసిన దాన్ని వివరాలు వెంటనే ట్యాబ్ లో నమోదు చేయాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం తేమ శాతాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు విక్రయాలు చేయొద్దని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమయ్యే అన్ని రకాల చర్యలు తీర్చే పట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు పంట వివరాలు తప్పుగా నమోదు చేయడం వల్ల ట్యాబ్ లోఎంట్రీ ఆలస్యం జరుగుతుందని నిర్వాహకులు కలెక్టర్ కి తెలిపారు.వెంటనే పంట వివరాలు సరి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ ఆర్ స్వప్న , తహసీల్దార్ పర్వీన్ షేక్ ,ఎంపిడిఓ శంకర్ సమైక్య సంఘాలు ప్రతినిధులు ,వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు .





## రకుల్ ప్రీత్ సింగ్‌పై దారుణమైన ట్రోలింగ్..! ఇంతకీ ఏం జరిగిందంటే..?

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. కన్నడ మూవీ 'గిల్లి'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తెలుగులో తొలిసారిగా 'కెరటం'లో నటించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ మూవీతో మంచి గుర్తింపును సాధించింది. ఆ తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు, మెగా హీరో రామ్‌చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్ సినిమాల్లో అవకాశాలను దక్కించుకొని.. తక్కువ సమయంలోనే టాలీవుడ్‌లో అగ్ర హీరోయిన్‌గా ఎదిగింది. ప్రస్తుతం టాలీవుడ్‌కు దూరమైంది. చివరగా తెలుగులో కొండపొలం మూవీలో నటించింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో బిజీగా మారింది. ప్రస్తుతం పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. పెళ్లయిన బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ వస్తున్నది. అయితే, ప్రస్తుతం సోషల్ మీడియాలో రకుల్ ప్రీత్ సింగ్‌పై ట్రోలింగ్ జరుగుతున్నది. దీపావళి పండుగ ఫైర్ క్రాకర్స్ గురించి చేసిన వ్యాఖ్యలను పలువురు సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. ఇంటర్వ్యూలో ఓ ప్రశ్నకు రకుల్ బదులిస్తూ.. 'దీపావళికి అంతా ఫైర్‌కాకర్స్ కాలుస్తుంటారు. చిన్నప్పుడు దీపావళి పండుగ సమయంలో మా పాప రూ.500 నోట్ ఇచ్చాడు. ఇప్పుడు రూ.500 ఎందుకిస్తున్నారు? అని అడిగాను. ఈ డబ్బుతోనే కదా నువ్వు ఫైర్‌కాకర్స్ కొని కాలుస్తావు. దాంతో ఎంత కాలుష్యమో తెలుసా? అని ప్రశ్నించారు. అదే డబ్బును అవసరం ఉన్న వారికి పేదవారికి ఇవ్వొచ్చని.. లేకపోతే చాక్‌లెట్స్, ఇంకా ఏమైనా కొని ఇవ్వచ్చని చెప్పారు. ఆయన చెప్పింది నిజమేనని అనిపించిందని, ఆ సమయంలో 5వ తరగతి చదువుతున్నాను. అప్పటి ఇప్పటి వరకు మళ్లీ బాణాసంచా కాల్చలేదు' అంటూ రకుల్ వివరించింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



## లిప్‌లాక్ సీనా..? హీరోయిన్ ఎవరైనా సరే ఓకే చెప్తా: హీరో

బుల్లితెర నుంచి వెండితెరకు పరిచయమైన చాలామంది నటీనటులు ఇప్పుడు మంచి స్థాయికి చేరుకున్నారు. అలాంటి వారిలో నటుడు కవిన్ ఒకరు. లిఫ్ట్ చిత్రంతో కథానాయకుడిగా పరిచయమైన ఈయన ఆ తర్వాత డాడా చిత్రంతో మంచి విజయాన్ని సాధించారు. అదేవిధంగా స్టార్ చిత్రం ఈయనకి మంచి పేరు తెచ్చి పెట్టింది. తాజాగా కవిన్ కథానాయకుడిగా నటించిన బ్లడీ బెగ్గర్ చిత్రం దీపావళి సందర్భంగా గత నెల 31వ తేదీన విడుదలై ప్రదర్శింపబడుతోంది. నవంబర్ 7న తెలుగులో కూడా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఒక భేటీలో ఏ హీరోయిన్‌తో లిప్‌లాక్ సన్నివేశంలో నటించాలని కోరుకుంటున్నారు అన్న ప్రశ్నకు అలాంటి కోరిక ఏమీ లేదని బదులిచ్చారు. అయితే కథకు అవసరమైతే ఏ నటితోనైనా లిప్‌లాక్ సన్నివేశంలో నటించడానికి సిద్ధమే అని పేర్కొన్నారు. ఇలా ఈయన చెప్పిన మాటలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కారణం కవిన్ ప్రస్తుతం మాస్క్ అనే చిత్రంలో నటిస్తున్నారు. దీని తర్వాత నయనతార జంటగా ఒక చిత్రం చేయనున్నారు. దీనికి కిస్ అనే టైటిల్ నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతుంది. ఇది రొమాంటిక్ లవ్ స్టోరీతో తెరకెక్కనున్న వైవిధ్య భరిత కథా చిత్రం అని సమాచారం. దీంతో ఈ చిత్రంలో నయనతార, కవిన్‌ల మధ్య లిప్‌లాక్ సన్నివేశాలు చోటు చేసుకోబోతున్నాయా అనే ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో నెలకొంది.



## గాయాన్ని లైట్ తీసుకుంది.. ఇప్పుడేమో బాధపడుతూ

'కలర్ ఫోటో' మూవీతో హీరోయిన్‌గా బోలెడంత గుర్తింపు తెచ్చుకున్న తెలుగమ్మాయి. చాందిని చౌదరి.. తీవ్రంగా గాయపడింది. ఆ విషయాన్ని ఈమెనే స్వయంగా బయటపెట్టింది. అయితే చాన్నాళ్ల క్రితం ఇది జరగ్గా.. తాను లైట్ తీసుకున్నానని ఇప్పుడు అనుభవిస్తున్నానని చెప్పుకొచ్చింది.చాందిని ఏం చెప్పింది? హలో.. నేను గత కొన్నిరోజుల నుంచి సోషల్ మీడియాలో యాక్టివ్‌గా లేను. ఎందుకంటే కొన్నాళ్ల క్రితం నాకు ఓ గాయమైంది. దాన్ని పెద్దగా పట్టించుకోకుండా షూటింగ్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు ఆ గాయం తిరగబెట్టింది. షూట్ కోసం వెళ్తుంటే గాయం వల్ల మరింత నొప్పిగా అనిపిస్తుంది. దీంతో అన్నింటికి కొన్నాళ్లు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మళ్లీ ఆరోగ్యం కుదుటపడిన తర్వాత సోషల్ మీడియాలోకి వస్తా' అని చాందిని చౌదరి ఇన్ స్టాలో స్టోరీ పోస్ట్ చేసింది. షార్ట్ ఫిల్మ్స్ నటిగా కెరీర్ మొదలుపెట్టిన చాందిని చౌదరి.. టాలీవుడ్‌లోనూ హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది. ఈ ఏడాది గామి, మ్యూజిక్ షాప్ మూర్తి, యేవమ్ చిత్రాలతో వచ్చింది. ప్రస్తుతం బాలకృష్ణ కొత్త మూవీలో నటిస్తోంది. బహుశా ఈమెకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయినట్లు ఉంది. అందుకే కొన్నాళ్లపాటు రెస్ట్ తీసుకుంటానని చెప్పినట్లు అనిపిస్తోంది.



## టాలీవుడ్ దర్శకుడికి మరోసారి పెళ్లంటూ రూమర్స్



ప్రేమలో పడటం, పెళ్లి చేసుకోవడం, విడాకులు తీసుకోవడం, మళ్లీ పెళ్లి చేసుకోవడం.. ఇలాంటి మాటలు సినిమా ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉంటాయి. త్వరలో నాగచైతన్య కూడా ఇలానే మళ్లీ పెళ్లిచేసుకోబోతున్నాడు. హీరోయిన్ శోభిత ధూళిపాళ్లతో కొత్త జీవితం ప్రారంభించబోతున్నాడు. ఇదలా ఉంచితే తెలుగు దర్శకుడు క్రిష్ కూడా మరోసారి వివాహం చేసుకోబోతున్నాడనే రూమర్స్ ఇప్పుడు హాట్ టాపిక్ అయిపోయాయి.గమ్యం', 'వేదం' తదితర సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న క్రిష్.. 2016లో రమ్య అనే డాక్టర్‌ని పెళ్లి చేసుకున్నాడు.

కొన్నాళ్లు బాగానే ఉన్నారు కానీ మనస్పర్థలు వచ్చి 2021లో విడిపోయారు. అప్పటినుంచే సింగిల్‌గానే ఉంటున్న క్రిష్.. ఇప్పుడు కొత్త జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడట. ఓ లేడీ డాక్టర్‌తో త్వరలో పెళ్లి జరగనుందని తెలుస్తోంది. వచ్చే వారం మేరకు నిశ్చితార్థం జరుపుకోనున్నారనే టాక్ వినిపిస్తుంది. క్రిష్ పెళ్లి చేసుకోబోయే మహిళకు ఇదివరకే పెళ్లయి విడాకులు తీసుకుందని, 11 ఏళ్ల కొడుకు కూడా ఉన్నాడని అంటున్నారు. మరి ఈ రూమర్స్ నిజమేనా అనేది తెలియాల్సి ఉంది. చివరగా 'కొండపొలం' మూవీతో పలకరించిన క్రిష్.. పవన్ 'హరిహర వీరమల్లు' సినిమా మొదలుపెట్టాడు. ఇది జరిగి ఏళ్లు గడిచిపోయింది. పవన్ ఎంతకీ ఈ మూవీ గురించి పట్టించుకోకపోవడంతో దర్శకుడిగా ఇతడు పక్కకు తప్పుకొన్నాడు. ప్రస్తుతం అనుష్కతో 'ఘాటీ' మూవీ చేస్తున్నాడు. ఇంతలోనే ఇలా క్రిష్ పెళ్లి రూమర్స్ రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయిపోయింది.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707